ప్రేమస్వరూపులారా! చాలామంది స్త్రీలు స్వామి తెలుగు పదములు వినాలని ఆశిస్తూ వచ్చారు. 'విద్యార్థులు ఎన్నియో విద్యలు నేర్చి టెక్నికల్, ఇంజనీరింగ్ ఇలాంటి విషయాలంతా చెబుతున్నారు. వారిని స్వామికూడా ప్రోత్సహిస్తున్నారు. కాని, అలాంటివన్నీ మాకేమాత్రం అర్థం కావడం లేదు. స్వామి తెలుగులో మాట్లాడితే వినాలని వుంది", అని కోరుతున్నారు.

చక్కెరకంటె తీపి దధిసారముకంటెను రుచ్యమౌను పెం
పెక్కిన తేనెకన్న అతి రుచ్యము నోటను పల్కపల్కగా
మిక్కిలి కమ్మనౌ అమృతమే యనిపించును గాన మీరు ఈ
చక్కని దాని మనసా స్మరియింపుడు రామనామమున్!

ప్రేమస్వరూపులారా!

భారతదేశము ప్రాచీనమైన, ప్రసిద్ధిగాంచిన చరిత్ర గలిగినటువంటిది. భారతదేశములో రామమందిరం లేని గ్రామము లేదు. ఏ గ్రామములో చూచినా 'రామా' అనే పేరుగలవారు తప్పకుండా వుంటారు. రామనామమనేది ప్రాచీన కాలమునుండికూడను ఏవిధముగాను మార్పుచెందక దేదీప్యమానంగా వెలుగొందుతూ వస్తున్నది. నాస్తికుడు, ఆస్తికుడు, ఆస్తిక నాస్తికులుకూడను 'రామా' అనే పేరును ఉచ్చరిస్తూనే వున్నారు. కూర్చున్న వ్యక్తి లేచే సమయంలో 'రామా' అంటాడు. భారతదేశములో రామనామము ప్రసిద్ధిగాంచినది. కేవలం ఇక్కడే కాదు, చైనా దేశములోకూడను రామనామము చాలా ప్రసిద్ధి గాంచినది. ప్రపంచమంతయు రామమయమే!

దశరథునకు చాలా కాలంవరకు పుత్ర సంతానం కలుగలేదు. అతనికి ముగ్గురు భార్యలు. ఎవరివల్లనైనను వంశోద్ధారకుడైన కుమారుడు కలుగుతాడేమోనని ఎంతో ఆశిస్తూ వచ్చాడు. కాని, అతనికి నిరాశే మిగిలింది. పుత్రసంతాన ప్రాప్తి నిమిత్తమై అతను నిరంతరము తపస్సు గావిస్తూ వచ్చాడు. ఆ కాలంలోగాని, ఈ కాలంలోగాని ఎప్పటికైనను తపస్సు ఫలించే తీరుతుంది. అంతేకాదు. తన ముగ్గురు భార్యలతో కలిసి పుత్రకామేష్టి క్రతువును ఆచరించాడు. ఆసందర్భమున యజ్ఞపురుషుడు ప్రత్యక్షమై దశరథునికి ఒక పాత్రనందించి, 'నాయనా దశరథా! ఈ పాత్రలో ఉన్న పాయసమును నీ ముగ్గురు భార్యలకు సమానంగా పంచు", అని చెప్పాడు. యజ్ఞపురుషుడు ప్రసాదించిన పాయసమును దశరథుడు ముగ్గురికీ మూడు గిన్నెలలో సమానంగా పంచాడు. కాని, కొన్ని గ్రంథములలో మరో విధంగా వ్రాయబడి ఉంది. దశరథుడు ఆ పాయసమును ముగ్గరికీ సమానంగా పంచలేదని, ఒకరికి ఎక్కువ, ఒకరి తక్కువ పంచాడని చెబుతారు. ఇది చాలా పొరపాటు. వసిష్ఠులవారి సమక్షంలో మూడు గిన్నెలలో పాయసమును సమానంగా పోసి తన భార్యల కందించాడు. 'మీ అభీష్టము సిద్ధించుగాక!' అని వసిష్ఠులవారు వారిని ఆశీర్వదించారు. రాణులు ఎంతో ఆనందంతో వారివారి పాయసపుగిన్నెలను వారి పూజామందిరాలకు తీసికొని వెళ్లారు. అయితే, సుమిత్ర మనస్సు పరిపరివిధాలుగా ఆలోచిస్తున్నది. దీనికొక కారణమున్నది. కేకయరాజు తన కుమార్తెయైన కైకేయిని దశరథ మహారాజుకిచ్చి పెండ్లి చేసినప్పుడు, 'నా కుమార్తెకు పుట్టిన కుమారునికే నీవు పట్టం కట్టాలి', అని షరతు విధించాడు. తప్పక అట్లే చేస్తానని దశరథుడు వాగ్దానం చేశాడు. దశరథుడు కైకకిచ్చిన మాటను తప్పడానికి వీలుకాదు. అందుచేత, కైక తనకు పుట్టబోయే కుమారుడే రాజు కాగలడని చాలా ఆనందంగా ఉన్నది. ఇక, కౌసల్య తాను పట్టపురాణి కనుక, తనకు కలిగే కుమారునికే దశరథుడు పట్టం కట్టగలడన్న ఆశతో ఎంతో సంతోషంగా ఉన్నది. ఆవిధంగా, కౌసల్య, కైకలు ఇరువురూ ఆనందంగా ఉన్నారు. కాని, సుమిత్రకు ఇట్టి ఆశ ఏమాత్రము లేదు. ఆమె శిరస్స్నానము చేసి, కురులార్పుకోవడానికి మేడపైకి వెళ్ళింది. ఆనాడు ఫ్యాన్లుగాని, హెయిర్ డ్రయర్లుగాని లేవు కదా! ఆమె తన

పాయసపు గిన్నెను మేడపై పెట్టి, కురులార్పుకుంటున్నది. ఇంతలో ఒక గద్ద వచ్చి ఆ గిన్నెను తన్నుకుపోయింది. ఈమెకు చాలా భయమేసింది. 'పాయసపు గిన్నెపోతే పోయింది. కాని, నా పతి, గురువుగారు నా అలక్ష్యానికి నన్నేమని నిందిస్తారో ఏమిటో!' అని తనలో తాను చాలా బాధపడుతూ వచ్చింది. వెంటనే క్రిందికి దిగి వచ్చింది. అక్కడ కౌసల్య, కైక ఇరువురూ ఆమెకోసం కాచుకొని ఉన్నారు. "ఏమక్కా! ఎందుకోసం నీవింత కంగారు పడుతున్నావు?' అని కైక ప్రశ్నించగా జరిగిందంతా పూసగ్రుచ్చినట్లు చెప్పింది, కైక. ఈనాటి సవతులవలె వారు ఒకరితో ఒకరు పోట్లాడుకునేవారు కాదు. స్వంత అక్కచెల్లెళ్లవలె పరస్పరం ఎంతో అన్యోన్యమైన ప్రేమానురాగాలతో మెలగేవారు. "అక్కా! నీవేమీ బాధపడనక్కర్లేదు. ఇదిగో, నా పాయసంలో కొంత నీకిస్తాను' అని చెప్పి ఒక గిన్నెను తెచ్చి తన పాయసంలో కొంతభాగం అందులో పోసింది. విశాలమైన హృదయం కలిగిన కౌసల్యకూడను తన పాయసంలో కొంత భాగము సుమిత్ర గిన్నెలో పోసింది. ముగ్గురుకూడను మూడు గిన్నెలలో సమానముగా పాయసమును తీసికొని గురువుగారి దగ్గరకు వెళ్లారు. "అమ్మా! గుణవంతులైన, చిరంజీవులైన, వీరాధివీరులైన, ప్రజారంజకంగా రాజ్యాన్ని పరిపాలించే కుమారులు మీకు జన్మింతురుగాక!" అని వారిని ఆశీర్వదించాడు.

మొదట కౌసల్యకు కుమారుడు పుట్టాడు. అతనియొక్క తేజస్సును, శక్తిని, ప్రకాశమును చూసి వసిష్ఠులవారు అతనికి 'రామా' అని పేరుపెట్టారు. రాముడనగా సర్వులను రమించేవాడు అని అర్థం. దశరథుని రెండవ భార్యయైన సుమిత్రకు ఇరువురు కుమారులు పుట్టారు. వసిష్ఠులవారికి చాలా ఆశ్చర్యం కలిగింది. 'ఏమిటిది, కౌసల్యకొక కుమారుడు, కైకకొక కుమారుడు పుట్టి ఈమెకు మాత్రం ఇరువురు బిడ్డలు పుట్టారే!" అనుకున్నాడు. అయితే, యోగదృష్టితో పరికించి జరిగిన కథను తెలుసుకున్నాడు. కౌసల్య ఇచ్చిన పాయస భాగమునుండి ఒక బిడ్డ, కైక ఇచ్చిన పాయస భాగమునుండి ఒక బిడ్డ, ఇలా ఇరువురు బిడ్డలు లక్ష్మణ, శత్రుఘ్నులు పుట్టారని ఆయన గుర్తించాడు. ఈవిధంగా, రామునిలో అర్ధ భాగము లక్ష్మణుడు, భరతునిలో అర్ధభాగము శత్రుఘ్నుడు. అప్పుడు సుమిత్ర తనలో తాను ఈవిధంగా అనుకుంది. ఎవ్వరికీ చెప్పలేదు. "రాముడు రాజయితే నా కుమారుడైన లక్ష్మణుడు అతనికి సేవకునిగా ఉండాలి. భరతుడే గనుక రాజయితే నా రెండవ కుమారుడైన శత్రుఘ్నుడు అతనికి సేవకునిగా ఉండాలి. నా ఇరువురు కుమారులకూ రాజ్యమక్కరలేదు. ఒకరు రామునికి, ఒకరు భరతునికి సేవ చేస్తూ ఉంటే చాలు", అని తృప్తిపడింది.

లక్ష్మణ, శత్రుఘ్నులు పుట్టినప్పటినుండి ఏడుస్తూనే వున్నారు. నిద్ర పోలేదు, ఏవిధమైన ఆహారముకూడను పుచ్చుకోలేదు. కారణమేమిటో సుమిత్రకు బోధపడలేదు. పిల్లలిరువురికీ మంత్రాలు వేయించింది, యంత్రాలు కట్టించింది; విభూతి పెట్టించింది. ఈరీతిగా అనేక రకములైన చికిత్స చేయిస్తూ వచ్చింది. కాని, ఏమాత్రం ఫలితం లేకపోయింది. ఏమి చేసినా వారు ఏడ్పు మానలేదు. అప్పుడామె వసిష్ఠులవారి దగ్గరకు వెళ్ళి, "గురుదేవా! నా కుమారులు ఎందుకీవిధంగా ఏడుస్తున్నారో నాకు బోధపడటం లేదు. దయవుంచి కారణం నాకు తెలుపండి", అని ప్రార్థించింది. అప్పుడు వశిష్ఠులవారు కొంత తడువు కన్నులు మూసుకుని తన తపోదృష్టితో చూసి, 'అమ్మా! లక్ష్మణుడు రామాంశము, శత్రుఘ్నుడు భరతాంశము. కనుక, నీవు లక్ష్మణుణ్ణి రాముడు పడుకున్న తొట్లెలో పరుండబెట్టు. అదేరీతిగా, శత్రుఘ్నుని భరతుని ప్రక్కన పరుండబెట్టు', అని సలహా ఇచ్చాడు. సుమిత్ర కౌసల్యకు, కైకేయికి ఈవిషయం చెప్పి, వారి అంగీకారంతో లక్ష్మణుణ్ణి రాముని ప్రక్కన, శత్రుఘ్నుని భరతుని ప్రక్కని పరుండబెట్టింది. తక్షణమే లక్ష్మణ, శత్రుఘ్నులు ఏడ్పు మాని ఆనందంతో కేరింతలు కొట్టసాగారు. ఆ తరువాత చక్కగా పాలు త్రాగి, హాయిగా నిద్రించారు. అప్పటినుండి రాముణ్ణి లక్ష్మణుడు, భరతుణ్ణి శత్రుఘ్నుడు నీడవలె అనుసరిస్తూ వచ్చారు.

వివాహమైన తరువాత కేకయరాజు భరతుణ్ణి తన రాజ్యానికి తీసుకు వెళ్ళాడు. అతని జతలో శత్రుఘ్నుడుకూడా వెళ్ళాడు. తండ్రి ఆజ్ఞను శిరసావహించి రాముడు అరణ్యానికి వెళుతుంటే, తండ్రి చెప్పకుండానే రాముని జతలో లక్ష్మణుడు కూడా వెళ్లాడు. ఈవిధంగా రామునికి జతగా లక్ష్మణుడు, భరతునికి జతగా శత్రుఘ్నుడు సంచరిస్తుంటే, చూసేవారికి రామలక్ష్మణులు వేరు, భరతశత్రుఘ్నులు వేరు అన్నట్లుగా అనిపించేది. కాని, నలుగురి మధ్య గల అన్యోన్య సోదర ప్రేమ సాటిలేనిది.

రామునివెంట అరణ్యానికి వెళ్ళడానికి సీతమ్మవారుకూడా సిద్ధమయ్యారు. వారికి సేవ చేసే నిమిత్తం లక్ష్మణుడు కూడా వారివెంట వెళ్ళాడు. సీతారామలక్ష్మణులు అరణ్యంలో సంచరిస్తూండగా వారికొక ఆశ్రమం కనిపించింది. అదెవరి ఆశ్రమమని విచారించి చూడగా, అగస్త్యుని ఆశ్రమమని తెలిసింది. సీతారామలక్ష్మణులను చూసి అగస్త్య మహర్షి, ఇతర ఆశ్రమవాసులు ఎంతగానో ఆనందించి వారికి స్వాగతం పలికారు. తమ ఆశ్రమాన్ని పావనం చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెల్పుకున్నారు. తరువాత మాటల సందర్భంలో అగస్త్య మహర్షి, "రామా! మీరీ ఆశ్రమంలో ఉంటే సుఖపడలేరు. ఇక్కడికి కొద్ది దూరంలోనే దండకారణ్యం ఉన్నది. అక్కడ మీకు అన్నివిధాలుగా సౌకర్యంగా ఉంటుంది. సీతమ్మకుకూడా ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఉంటుంది. అక్కడ మీకు భుజించడానికి కావలసినన్ని పండ్లు లభిస్తాయి. అక్కడే పవిత్ర గోదావరి నదికూడా ప్రవహిస్తోంది. కాబట్టి, మీరు అక్కడ నివాసం ఏర్పర్చుకోండి", అని సలహా ఇచ్చాడు. అతని సలహానుసరించి, సీతారామలక్ష్మణులు దండకారణ్యంలో పంచవటీ తీరమున పర్ణశాలను నిర్మించుకొని సుఖంగా కాలం గడుపుతూ వచ్చారు.

ఆ ఆశ్రమంలో అనేక రకములైన జంతువులు సంచరిస్తూ ఉండేవి. ఒకనాడు సీత ఒక బంగారు లేడిని చూడటం తటస్థించింది. సీతకు తెలుసు తనకున్న బంగారు ఆభరణాలన్నింటినీ అయోధ్యలోనే వదలిపెట్టి అరణ్యానికి వచ్చిన సీతకు బంగారు లేడిపై వ్యామోహం ఎందుకు వుంటుంది! ఆమెకు తెలుసు – ఈ జగత్తులో బంగారు లేడి పుట్టటానికి వీల్లేదని. అదేదో మాయలేడి అయివుంటుందని భావించింది. కాని, విధి బలీయము. బంగారు లేడి ఉండటానికి వీల్లేదని తెలిసికూడను దానిని పట్టితెమ్మని రాముని కోరింది. "రామా! ఎంత అందంగా ఉన్నదీ లేడి! దానిని పట్టి తెస్తే మన ఇంటి దగ్గర పెట్టుకొని దానితో ఆడుకుంటూ హాయిగా కాలక్షేపం చేయవచ్చు. మీరు అరణ్యంలో తిరుగుతుంటే నేను ఇంటివద్ద ఒంటరిగా ఉంటున్నాను. నాకీ కొద్దిపాటి ఆనందాన్ని అందించరా?" అని అభ్యర్థించింది. "సరే, నీ ఆనందమే మా ఆనందము" అని రాముడు ఆ బంగారు లేడిని పట్టి తీసుకురావడానికి సంసిద్ధుడయ్యాడు. అప్పుడు లక్ష్మణుడు, "అన్నా! ఇది మాయలేడి; నిజమైన బంగారు లేడి కాదు. ఎవరో రాక్షసుడు మాయపన్ని ఈవిధమైన రూపాన్ని ధరించినట్లు నాకనిపిస్తున్నది. అయినా, దానిని పట్టి తేవడానికి నీవు పోనక్కర్లేదు. నేను వెళతాను", అన్నాడు. కాని, ఆపదలొచ్చే సమయంలో బుద్ధి సరిగా పనిచేయదంటారు. "నీవు మాత్రమే దానిని పట్టుకొని తీసుకు రాగలవు", అంటూ సీత రాములనే వెళ్లవలసిందిగా బలవంతం చేసింది. ఆ సమయంలో ఆమె బుద్ధి ఆవిధంగా పనిచేసింది. సీత ప్రోద్బలంచేత రాముడు ఆ మాయలేడిని తరుముకుంటూ వెళ్ళాడు. కొంతదూరం వెళ్లిన తరువాత అంబును విడిచాడు. అది తాకేసరికి ఆ రాక్షసుడు తన నిజస్వరూపాన్ని ధరించి, 'హా సీతా! హా లక్ష్మణా!' అంటూ ప్రాణం విడిచాడు. అది రాముని గొంతు మాదిరి వినిపించింది, సీతకు. "లక్ష్మణా! నీవు వెళ్లు, వెళ్లు, తక్షణమే రామునికి సహాయంగా వెళ్లు. రాముడు ఏదో ఆపదలో చిక్కుకొని మనల్ని పిలుస్తున్నట్లున్నాడు", అన్నది. అప్పుడు లక్ష్మణుడు, "అమ్మా! ఇదేదో రాక్షసమాయ కావచ్చు. రామునికి ఎట్టి ఆపదా సంభవించడానికి వీల్లేదు. నీవు ధైర్యంగా ఉండు", అన్నాడు. లక్ష్మణుడు అక్కడినుండి కదలకపోవడంతో సీత అతనిపై అనేక రకాలుగా నిందలు వేసింది. "రాముడు పోతే నీవు నన్నేలాలని చూస్తున్నావా?" అంటూ చెడ్డ మాటలు మాట్లాడింది. ఈ మాటలు వినలేక లక్ష్మణుడు తక్షణమే అక్కడినుండి

బయలుదేరాడు. అయితే, వెళ్ళే ముందు ఆశ్రమం చుట్టూ ఒక గీత గీశాడు. “తల్లీ! నీవు నన్ను తిడితే తిట్టావు. కాని, ఎట్టి పరిస్థితిలోనూ నీవీ గీతను దాటి బయటికి రావద్దు. రాక్షసులుగాని, మృగములుగాని, ఏవిధమైన క్రిమికీటకాదులుగాని దీనిని దాటి లోపలికి రావడానికి వీలుకాదు”, అన్నాడు. ఈనాటికికూడను చాలామంది బజార్లో అమ్ముతుంటారు, ‘లక్ష్మణ రేఖ’ అని. దానిని గీస్తే ఏ క్రిమికీటకాదులుకూడా దానిని దాటిరాలేవు. రావణునికి కూడా లక్ష్మణుడు గీసిన గీతను దాటి లోపలికి రావడానికి వీల్లేకపోయింది. బయటనే నిలబడి, ‘భవతీ భిక్షాం దేహి’ అని దీనంగా అరుస్తున్నాడు. ‘అయ్యో పాపం, ఆకలిగొని వున్న వ్యక్తిని ఈవిధంగా బాధపెట్టడం న్యాయం కాదు’, అనుకొని సీత అతనికి భిక్షం వేసే నిమిత్తం గీతను దాటి బయటికి వచ్చింది. గీతను దాటిన తక్షణమే రావణుడు ఆమెను అపహరించి లంకకు తీసుకు పోయాడు. రామలక్ష్మణులు తిరిగి వచ్చిన తరువాత సీత అపహరణకు గురి అయినదని గ్రహించి చాలా విచారించారు. లక్ష్మణుడు చెప్పిన మాటలను విననందుకే తనకీ దురవస్థ కలిగిందని సీత చాలా బాధపడుతూ వచ్చింది. అశోకవనంలో కూర్చుని ఆమె తనలో తాను ఈవిధంగా అనుకుంటున్నది –

“ఈ చెఱలోనుంచి వెళ్లేనా!
నే ఇక రాముల కన్నుల చూచేనా!
నా ముద్దు మరిది ఓ లక్ష్మణా!
నిన్ను దుర్భాషలాడితి సద్గుణా!”

“లక్ష్మణా! నోటికి వచ్చినట్లుగా మాట్లాడి నీ హృదయాన్ని గాయపరచినందుకు నేను తగిన శిక్షను అనుభవిస్తున్నాను”, అని పశ్చాత్తాపపడుతూ వచ్చింది. ఈవిధంగా సీత లంకలో పది నెలలు గడిపినది. అయితే, ఒక్కనాడైనా ఆమె రావణుని ముఖము చూడలేదు. వాడు ఎన్ని రకములైన వేషములు వేసుకొని వచ్చినా, ఎన్ని రకములైన వాగ్దానములు చేసినా ఏమాత్రము తాను లొంగలేదు. ‘ఛీ! నీవు రాముని కాలిగోటికికూడా సరితూగవు’, అని వానిని చీదరించుకుంది. వాడు రాముణ్ణి చులకనచేసి మాట్లాడుతుంటే సీత కోపోద్రిక్తురాలైంది. “రాముడు మహాధీరుడు, వీరుడు, గంభీరుడు. నీవొక హీనుడవు, అల్పుడవు. రాముని పేరు ఉచ్చరించడానికికూడా నీకు అర్హత లేదు”, అన్నది.

చిట్టచివరికి రావణుడు ‘ఇక నీకు పది రోజులు గడువిస్తున్నాను’ అని మూర్ఖంగా పలికి అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

మనస్సుకు మనసు సాక్షి
దేహమునకు గుణము సాక్షి
మృతాలకు మూర్ఖం సాక్షి
సర్వమునకు స్వామి సాక్షి

“నా మనస్సే నాకు సాక్షి. కాబట్టి, నన్నెవరూ ఏమీ చేయలేరు” అనుకొని సీత రామచింతన చేస్తూ ధైర్యంగా ఉన్నది. సీతకు కాపలాగా నియమింపబడిన రాక్షస స్త్రీలలో అజట, త్రిజట అనేవారున్నారు. వీరిద్దరూ విభీషణుని బిడ్డలు. ఒకనాడు త్రిజట దుఃఖిస్తున్న సీతను ఓదార్చుతూ, “అమ్మా! రాత్రి నాకొక స్వప్నం వచ్చింది. ఎవరో ఒక కోతి వచ్చి లంకను కాల్చినట్లు, రాముడు వచ్చి రావణుని సంహరించి నిన్ను అయోధ్యకు తీసికొని వెళ్లినట్లు నాకు స్పష్టంగా కనిపించింది”, అన్నది. అజటకూడా, “నిజమేనమ్మా! నాకుకూడా అదేవిధమైన స్వప్నం వచ్చింది. నీవింక విచారించనక్కర్లేదు”, అని ధైర్యం చెప్పింది. వారిరువురికీ సీతపైన చాలా ప్రేమ, విశ్వాసము. విభీషణుడు

రామభక్తుడు. కాబట్టి, అతని బిడ్డలుకూడా రామభక్తినే ప్రకటిస్తూ వచ్చారు.

ఈవిధంగా పది నెలలు గడిచిపోయాయి. ఒకనాడు ఉన్నట్లుండి లంకలో పెద్ద అల్లకల్లోలం చెలరేగింది. ఏమిటని విచారిస్తే, రామ రావణ యుద్ధం ప్రారంభమైందని తెలిసింది. కొద్ది రోజుల్లో రావణుని మరణవార్తకూడా వచ్చింది. ఎట్టకేలకు ఈ చెఱనుండి విముక్తి పొంది రాముని సన్నిధికి చేరుకుంటున్నానని సీత ఎంతగానో ఆనందించింది. అయితే, తాను రామునివద్దకు వెళ్ళాలా లేక, రాముడే తనవద్దకు వచ్చి తనను తీసికొని వెళతాడా? ఇది ఏవిధంగా జరుగుతుందో అని ఆమె మనసులో ఒక సందేహం నెలకొన్నది. ఇంతలో రాముడే సీతను తనవద్దకు తీసికొని రావలసిందిగా వార్త పంపించాడు. వానరులంతా అక్కడికి వచ్చారు. అసలే వానరులు, వాళ్ల సంగతి వేరే చెప్పనక్కర్లేదు కదా! సీతమ్మను చూడాలనే ఆశతో ఒకరిపై ఒకరు ఎగురుతున్నారు, దుముకుతున్నారు. సీతమ్మను చూసి హృదయానందనమును పొందారు. అందరూ కలిసి ఆమెను రామునివద్దకు తీసుకు వెళ్లారు. కాని, రాముడు ఆమెవైపు చూడలేదు, తల వంచుకునే కూర్చున్నాడు. సీత అగ్నిలో ప్రవేశించి తన పవిత్రతను నిరూపించుకునే నిమిత్తం చితిని పేర్చమని అక్కడున్నవారిని ఆదేశించాడు. సీత గుణవంతురాలని, మహాపతివ్రత అని రామునికి తెలుసు. కాని, జగత్తుకుకూడా తెలియాలి కదా! 'పది నెలలు లంకలో ఉన్న సీతను రాముడు ఏవిధంగా స్వీకరించాడు?' అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. వారికి తాను జవాబు చెప్పాలి కదా! కనుకనే, సీతను అగ్నిపరీక్షకు గురిచేశాడు. ఈ సత్యాన్ని గుర్తించిన సీత అగ్ని చుట్టూ మూడు ప్రదక్షిణలు చేసి, రాముని తల్చుకుంటూ అందులోకి దూకింది. తక్షణమే అగ్నిదేవుడు ప్రత్యక్షమై, "రామా! ఈమె మహా పతివ్రత, మహా సాధ్వీమణి. ఈమెను నీవు సందేహించడం న్యాయం కాదు. దయచేసి ఈమెను స్వీకరించవలసింది", అని పలికి సీతను రామునికి అప్పజెప్పాడు. సీతయొక్క పవిత్రత అందరికీ ప్రత్యక్షంగా నిరూపణ అయింది. ఈ సంఘటన సీతయొక్క సత్యప్రమాణమును, పాతివ్రత్య మహిమను ప్రపంచానికి చాటింది.

రావణుని సోదరుడైన విభీషణుడు సీతారామలక్ష్మణులను పుష్పక విమానంలో అయోధ్యకు చేర్చాడు. శ్రీరామ పట్టాభిషేకం అత్యంత వైభవోపేతంగా జరిగింది. రామరాజ్యంలో అందరూ సుఖశాంతులతో జీవిస్తూ వచ్చారు.

రామాయణగాథ అత్యంత పవిత్రమైనది. ఆకాలంలో స్త్రీలను వారి పతివ్రతా ధర్మమే రక్షిస్తూ వచ్చింది.

గత జీవుడగు పతిన్ బ్రతికించుకొన్నట్టి
సావిత్రి భారత సతియె కాదె
తన సత్యమహిమచే దావాగ్ని చల్లార్చె
చంద్రమతి భారత వనిత కాదె
కులసతీత్వమునకై గుండాన దూకిన
సీత భారతధరా జాత గాదె
కినిసి దుర్మద కిరాతుని బూది గావించె
దమయంతి భారత రమణి గాదె
సత్త్వసాగర పరివేష్టితోర్వితలము
భరతజాతి పాతివ్రత్య ప్రవిమలంబు
భావ సంపద కిది మహాపంటభూమి
అఖిల దేశాల కిది ఉపాధ్యాయి కాదె!

పతివ్రతా ధర్మమనేది ఒక్క భారతదేశమునకు మాత్రమే పరిమితమైయున్నది. ఏ ఇతర దేశమునందుకూడను ఇది కానరాదు. ఆకాలంలో మగవారు ఆడవారు కనిపిస్తే తలవంచుకొని వెళ్ళేవారు. కాని, ఇప్పుడు చూస్తామా అంటే,

బజార్లో నిలబడి ఒకరితో ఒకరు మాట్లాడుతుంటారు. ఇటువంటి దృశ్యం ద్వాపరయుగాంతంలో ఒకనాడు ధర్మరాజు కంటపడింది. వెంటనే తన సోదరులను సమావేశపరచాడు. "భీమా! అర్జునా! నకుల సహదేవులారా! కలియుగం ప్రారంభమైంది. నిన్నటి దినము నేను నగరంలో సంచరిస్తుంటే ఒక స్త్రీ వచ్చి ఒక పురుషునితో మాట్లాడటం చూశాను. ఇటువంటి అనైతిక ప్రవర్తనను నేను చూడలేను", అన్నాడు. ఇంకొక దినము అర్జునుడు వచ్చి చెప్పాడు, "ఈరోజు సాయంకాలం ఒక రైతు తన పొలంనుండి మడక, భూమిని దున్నే నాగలి వీటన్నింటినీ తలపై పెట్టుకొని ఇంటికిపోవడం చూశాను. 'ఎందుకయ్యా, వీటిని మోసుకెళుతున్నావు? పొలంలోనే వదలిపెట్టి వెళ్లకూడదా?' ఎని ఎవరో అడిగితే, 'అయ్యో, అలా చేయడానికి వీల్లేదు స్వామీ, వీటిని పొలంలో వదలిపెడితే ఎవరో దొంగలు ఎత్తుకెళుతున్నారు. అందుకోసమే, వీటిని ఇంటికి తీసుకెళుతున్నాను", అన్నాడు. ఇంకొకరు తమ ఇంటికి తాళం వేసుకొని వెళ్లడం కనిపించింది. 'ఎందుకమ్మా తాళం వేయడం?' అని అడిగితే, 'తాళం వేయకపోతే ఇంట్లోకి ఎవరో దూరి సామాన్లు తీసికొనిపోతున్నారు', అని చెప్పింది." కలియుగం ప్రారంభమైనది. కనుకనే, ఈ దుర్లక్షణములన్నీ కనిపిస్తున్నవి.

రాముని కాలంలో ఇళ్లకు తాళాలు వేయడంగాని, పంటపొలాల్లో ఉన్న సామగ్రిని మోసుకొని ఇంటికి తెచ్చుకోవడం గాని, వీధుల్లో ఆడ, మగ ఇరువురూ చేరి మాట్లాడుకోవడంగాని ఇటువంటివేమీ జరిగేవి కావు. కలిప్రభావము చేతనే ఇలాంటివన్నీ ప్రారంభమైనాయి. "కలికాలం ప్రారంభమైంది కనుక మనమందరం ఇక నిష్క్రమిద్దాం" అని నిర్ణయించుకొని పాండవులు వైకుంఠానికి వెళ్లినారు. పవిత్రమైన జీవితాన్ని గడిపినటువంటివారు పాండవులు. అటువంటి పుణ్యమూర్తులవల్లనే భారతదేశమునకు పవిత్రమైన దేశముగా పేరు వచ్చింది. కాని, ఈనాడు అట్టి పవిత్రత క్షీణించిపోయింది. అయితే, పవిత్రత లేకపోలేదు. కాని, అందరికీ కనిపించేటట్లుగా లేదు. ధర్మమే అందరినీ రక్షిస్తుంది. కనుక, ఆడ మగ ఇరువురూ ధర్మాన్ని కాపాడుకోవాలి. ఇందు నిమిత్తం మనస్సును నిర్మలంగా, నిశ్చలంగా ఉంచుకోవాలి. పిచ్చిపిచ్చి ఆలోచనలకు చోటివ్వకూడదు.

అహల్య మహాగుణవంతురాలు. అయినా భర్త శాపానికి గురి కావలసి వచ్చింది. 'రాయిగా పడి వుండమ'ని ఆమె భర్త శపించాడు. ఆ తరువాత రాముని అనుగ్రహంచేతనే ఆమెకు శాపవిమోచనం కలిగింది. రాముని పాదస్పర్శ సోకిన తక్షణమే ఆ రాయి అహల్యగా మారిపోయింది. అపవిత్రమును పవిత్రము గావిస్తాడు, భగవంతుడు. మాలిన్యమునుకూడను పరిశుద్ధము గావిస్తాడు, భగవంతుడు. మనస్సులో ఎన్ని చెడ్డ భావములు కలిగినప్పటికీ భగవంతుని తలుచుకుంటే ఆ మాలిన్యమంతా నిర్మూలమైపోతుంది. అన్నింటికీ మన మనస్సే కారణం. స్త్రీలుగాని, పురుషులుగాని పవిత్రమైన భావాలను పెంచుకోవాలి. హృదయాన్ని పరిశుద్ధం గావించుకోవాలి. అప్పుడే మానవత్వము మానవత్వంగా నిలుస్తుంది; లేకపోతే దానవత్వంగా మారిపోతుంది.

(రామ రామ రామ రామ సీతా... అనే పాటతో భగవాన్ తమ దివ్యోపన్యాసం ముగించారు)

(2006 అక్టోబరు 1వ తేదీ దసరా సందర్భముగా సాయికుల్వంత్‌లో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)